

రాత్రివేళ యువగర్జన ప్రాంగణంలో జనం సందడి



ఎన్టీఆర్ ప్రాంగణం వద్ద పోలీసుల తనిఖీలు



యువగర్జన ఏర్పాట్లపై కోడెలతో మాట్లాడుతున్న ఆంజనేయులు

# జిల్లా నుంచి 132 ఆర్టీసీ బస్సులు

## సాధారణ సర్వీసుల దారిమళ్లింపు

కొత్తపేట, న్యూస్‌టుడే

తెలుగుదేశం పార్టీ యువగర్జన సభకు గుంటూరు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి మొత్తం 132 ఆర్టీసీ బస్సులు బయలుదేరుతున్నాయి. తెదేపా కార్యకర్తలు, అభిమానుల్ని సభకు తరలించేందుకు గాను పార్టీ నాయకులు ఆర్టీసీ బస్సులను అద్దె ప్రాతిపదికన తీసుకున్నారు. జిల్లా పరిధిలో తీసుకున్న 132 బస్సుల గాను డిపోలవారీగా ఇప్పటికే అద్దెను చెల్లించారు. దీంతో ఒక్కో బస్సుకు సుమారు రూ. 10 వేల చొప్పున ఆర్టీసీ గుంటూరు రీజియన్‌కు సుమారు రూ. 13 లక్షల ఆదాయం సమకూరింది. అత్యధికంగా పిడుగురాళ్ళ డిపో పరిధిలో 41 బస్సులకు చెల్లింపులు జరిగాయి. గుంటూరు-1 డిపో నుంచి 25, గుంటూరు-2 డిపో నుంచి 25, సత్తెనపల్లి డిపో నుంచి 15, రేపల్లెడిపో నుంచి 1 చొప్పున అద్దెను చెల్లించడంతో ఆమేరకు అధికారులు బస్సులను కేటాయించారు.

మాచర్ల, పిడుగురాళ్ళ, సత్తెనపల్లి పరిసర ప్రాంతాల్లో నాయకులు సూచించిన గ్రామాలకు ఈబస్సులు బుధవారం ఉదయాన్నే చేరుకుంటాయి. గ్రామాల నుంచి కార్యకర్తల్ని, అభిమానుల్ని ఎక్కించుకుని యువగర్జన జరుగుతున్న నాగార్జున వర్శిటీ వద్దకు వారిని తరలిస్తాయి. మరోవైపు.. తెలుగుదేశం నాయకులు అద్దెకు తీసుకుంటున్న ఆర్టీసీ బస్సుల సంఖ్య పెరిగే అవకాశాలూ లేకపోలేదని సంస్థ ప్రాంతీయ అధికారి ఎస్. అస్లామ్ అన్సారీ మంగళవారం 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

### మధ్నాహ్నం నుంచి దారిమళ్ళింపు

యువగర్జన సభకు రాష్ట్రం నలుమూలల నుంచి పెద్దసంఖ్యలో అభిమానులు వాహనాల్లో తరలివస్తుండటంతో బుధవారం జాతీయ రహదారి పై ట్రాఫిక్ నిలిచిపోయే ప్రమాదం ఏర్పడింది. తద్వారా గుంటూరు - విజయవాడ మధ్య రాకపోకలు సాగించే సాధారణ ప్రయాణికులు ఇబ్బందికి గురయ్యే అవకాశముంది. దీంతో ఆర్టీసీ సర్వీసుల్ని దారిమళ్ళించి నడిపేందుకు సంస్థ అధికారులు చర్యలు తీసుకున్నారు. మధ్నాహ్నానికే రహదారిపై రాకపోకలకు అంతరాయం ఏర్పడి వాహనాలు బారులు తీరే అవకాశముంది.

పోలీసుల పర్యవేక్షణ ఉన్నా వేలసంఖ్యలో వచ్చే వాహనాల వల్ల ఇబ్బందులు తప్పకపోవచ్చు. దీంతో మధ్నాహ్నం నుంచి గుంటూరు-విజయవాడ మధ్య బస్సులను దారి మళ్ళించనున్నారు. తక్కెళ్ళపాడు, నందివెలుగు, దుగ్గిరాల మీదుగా బస్సుల్ని పంపేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. గుంటూరు నుంచి విజయవాడమీదుగా బుధవారం మధ్యాహ్నం నుంచి హైదరాబాదు వెళ్ళే ఆర్టీసీ బస్సుల్ని సైతం సత్తెనపల్లి, నల్గొండ మీదుగా హైదరాబాదు పంపేందుకు చర్యలు తీసుకుంటున్నామని ప్రాంతీయ అధికారి ఎస్. అస్లామ్ అన్సారీ వివరించారు. మరోవైపు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి గర్జనకు తరలివస్తున్న బస్సుల పార్కింగ్, ఆర్టీసీ బస్సుల్లో సాధారణ ప్రజల ప్రయాణానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసేందుకు డిపో మేనేజర్లను పార్కింగ్ ప్రదేశాలు, జాతీయ రహదారిపై విధులను అప్పగిస్తున్నట్లు ఆయన చెప్పారు.

## పాత జ్ఞాపకాలు గుర్తొచ్చాయి: కోడెల

**గ్రామీణ మంగళగిరి:** ఎన్టీఆర్ ప్రాంగణంలో యువగర్జన సదస్సు నిర్వహణ సందర్భంగా ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను పార్టీ నాయకులు కోడెల శివప్రసాదరావు, పయ్యావులపు కేశవ్, ఎమ్మెల్యే దేవినేని ఉమామహేశ్వరరావులు మంగళవారం పరిశీలించారు. ఫొటో ఎగ్జిబిషన్ నిర్వహణ కన్వీనర్ నన్నపనేని రాజకుమారి ఫొటోలు ఏర్పాటు చేసిన క్రమాన్ని వివరించారు. ఎన్. టి. రామారావు తెలుగుదేశం పార్టీ ఏర్పాటు చేసిన తొలినాళ్ళ నుంచి ఆయన తుదిశ్వాస విడిచే వరకు, చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా చేసిన పనులు ప్రతిపక్షంలోకి వచ్చాక మీకోసం యాత్ర జరిగిన క్రమాన్ని వివరిస్తూ ఫొటోలు ఏర్పాటు చేశారు. వీటిల్లో చేనేత కార్మికులు, రైతుల ఆత్మహత్యలు, ఆకలి చావులు, అధిక ధరలు, ప్రభుత్వ అవినీతి, అక్రమాలు తెలిపే కళాత్మక చిత్రాలతోపాటు సందేశాలను జతచేసిన ఫ్లెక్సీలను కూడా ప్రదర్శించారు. ఈ ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలించిన అనంతరం న్యూస్‌టుడేతో కోడెల మాట్లాడుతూ ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీ పెట్టిన నాటి నుంచి తాము పార్టీలో ఉన్నామని, అన్నగారితో ఆనాటి సంఘటనలను ఫొటోల్లో చూసి జ్ఞప్తికి తెచ్చుకున్నామన్నారు. అన్నగారి స్ఫూర్తితో నందమూరి వారసులంతా ఈ యువగర్జన సదస్సులో పాల్గొంటున్నారని, అవినీతి కాంగ్రెస్ ప్రభుత్వానికి చరమగీతం పాడే రోజులు దగ్గర పడ్డాయని కోడెల అన్నారు. యువగర్జన సదస్సుకు అంచనాలకు మించి ప్రజలు తరలివస్తారని అభిప్రాయపడ్డారు.



ప్రాంగణానికి తరలివచ్చిన జనం



ఎన్టీఆర్ విగ్రహం వద్ద అభిమానుల సందడి



యువగర్జన వేదికపై డాగ్‌స్క్వాడ్ తనిఖీ



బాబూమోహన్‌తో ఎర్రబెల్లి దయాకరరావు కరచాలనం



విశ్వవిద్యాలయం వద్ద ఏర్పాటుచేసిన భారీ ఫ్లెక్సీ



అన్నను తిలకిస్తున్న చెల్లెలు



ప్రాంగణంలో కళా వెంకట్రావు పూజలు